క్లుప్తంగా

ముస్లింలకు మిఠాయిల పంపిణీ



స్వీట్లు, ఖర్జూరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మద్దికెర: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక ముస్లింలకు సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్వాహకుడు విజయ్ ప్రసాద్ శుక్రవారం స్వీట్లు, ఖర్జూరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో పవిత్రంగా ఉపవాసదీక్షలు చేస్తారన్నారు. దీక్ష విరమణ కోసం తాము మిఠాయిలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

హొళగుంద: ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని కర్ణాటక రాష్ట్రం గదగ్ పుట్టరాజు గవాయిలు పుణ్యాశ్రమం మఠం మఠాధీశులు కల్లయ్య అజ్జ అన్నారు. మండల కేంద్రం సిద్ధేశ్వరస్వామి ఆవరణలో శుక్రవారం కల్బుర్గి శరణ బసవేశ్వరస్వామి పురాణ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కల్లయ్య అజ్జకు శుక్రవారం రాత్రి తులాభారం నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారిని భక్తులు ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగ కల్లయ్య అజ్జ సిద్దేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులు ఆయనకు తులాబారం నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం స్వామి భక్తులనుద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు భక్తులకు అన్నదానం చేశారు. ఆదివారంతో పురాణ ప్రవచన కార్యక్రమం ముగిస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నీటి సమస్య పరిష్కారం

మద్దికెర : మండల పరిధిలోని మదనంతపురం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఈఓ పరమేష్ అన్నారు. గ్రామంలో గతంలో వేసిన బోరుకు ఓ వ్యక్తి అక్రమంగా పైపులైను వేసుకుని నీటిని వాడుకుంటుండడంతో నీటి సమస్య తలెత్తింది. ఎంపీడీఓ నరసింహమూర్తి ఆదేశాల మేరకు వెంటనే పైపులైను తీయించేశారు. భవిష్యత్తులో ఎవరు కూడా నీటి చౌర్యానికి పాల్పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు ఈఓ తెలిపారు.

అందరికీ ఉపాధి పని

గోనెగండ్ల: జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు డ్వామా పీడీ అమరనాథ రెడ్డి అన్నారు. మండల కేంద్రం గోనెగండ్ల ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న చాకిరేవులో పూడిక తీత పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేసుకుంటే రోజుకు రూ.272 వేతనం పడుతుందని తెలిపారు. అలాగే వేసవి కాలం ప్రారంభమైంది కాబట్టి ఎండ వేడి తగలకుండా ఉదయం 7 గంటలకు వెళ్లి 11 గంటల లోపు ఇంటికి వెళ్లాలన్నారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు నీడ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం రైతు లక్ష్మన్న సాగుచేసిన పూలతోటను (మల్లెపూల)ను పరిశీలించారు. ఆయన వెంట డీపీఓ సిద్ధలింగమూర్తి ఉన్నారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడి మృతి



మూలింటి బాలకృష్ణ (ఫైల్)

ఆస్పరి: ఆస్పరి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మూలింటి బాలకృష్ణ (56) గురువారం రాత్రి ఆస్పరిలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన 2006 నుంచి 2011 వరకు మండల జెడ్పీ టీసీగా పనిచేశారు. ఈయనకు భార్య, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. శుక్రవారం దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆస్పరికి వచ్చి బాలకృష్ణ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలకృష్ణ మృతి పార్టీకి తీరని లోటన్నారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

కృష్ణగిరి: కృష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామంలోని డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం ఐదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఐదవ తరగతికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్ష ఉంటుందని ఈ పరీక్షకు 882 మంది విద్యార్థులు హాజరవుతారని, సాయంత్రం 2 గంటల నుంచి 4:30 వరకు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 504మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉందన్నారు.

గడ్డివాముల దగ్ధం

ఆలూరు రూరల్: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఆలూరు పట్టణంలో శుక్రవారం ఐదు గడ్డివాములు దగ్ధమయ్యాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు గుంతకల్లు రోడ్డులోని ఇంద్ర నగర్ కాలనీలో ముస్తఫా, అబ్దుల్ సలీం, బసవ రాజ్, ఉచ్చీరప్పలకు చెందిన 4 గడ్డివాములకు నిప్పంటుకుంది. స్థానికులు గమనించి ఫైర్ అధికారులకు సమాచారమిచ్చారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి మంటలార్పి వేశారు. ప్రమాదంలో రూ.1 లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆలూరు అగ్నిమాపక అధికారి ఖాద్రి తెలిపారు. అలాగే ఇదే రోజు మధ్యాహ్నం 2.45 నిమిషాలకు బళ్లారి రోడ్డులోని గాదిలింగప్ప అనే రైతుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. ప్రమాదంలో రూ.20 వేల ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు.

- ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత
- రూ.12.60 కోట్లతో ఎమ్మిగనూరు వైద్యశాల ఆధునికీకరణ
- 100 పడకలకు అప్‌గ్రేడ్

చెంతకే వైద్యం!



ఎమ్మిగనూరు ఆసుపత్రి ఆధునికీకరణ నమూనా



నిర్మాణంలో ఆస్పత్రి నూతన భవన సముదాయం

ఎమ్మిగనూరు: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పల్లెల్లో వైద్య సేవలు మెరుగుపరుస్తోంది. ఇప్పటికే ప్రతి సచివాలయంలో ఆరోగ్య కార్యకర్తలను నియమించడంతో పాటు ఆరోగ్య ఉపకేంద్రాల ఆధునికీకరణకు చర్యలు చేపట్టింది. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి రోగుల చెంతకే వైద్యాన్ని తీసుకొచ్చింది. దీంతో పాటు కమ్యూనిటీ హెల్త్ ఆసుత్రులు, ఏరియా ఆసుపత్రుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అవసరమైన చోట ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేస్తోంది. స్థానికంగానే పూర్తి స్థాయి వైద్యసేవలు అందించేందుకు వీలుగా ఎమ్మిగనూరు కమ్యూనిటీ వైద్యశాలను ఆధునిక హంగులతో సిద్ధం చేస్తున్నారు.

100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్

ఎమ్మిగనూరు,మంత్రాలయం నియోజకవర్గాల ప్రజలతో పాటు సి.బెళగల్, ఆస్పరి, దేవనకొండ ప్రాంతాల్లోని మెజార్టీ గ్రామాల ప్రజలకు ఎమ్మిగనూరు ప్రభుత్వవైద్యశాలలో విస్తృత వైద్యసేవలందుతున్నాయి. ప్రారంభంలో 30 పడకల ఆసుపత్రిగా ఉన్న ఈ వైద్యశాలను 2002లో కమ్యూనిటీ ఆసుపత్రిగా మార్చి 50 పడకలకు పెంచారు. నేడు100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. రూ.12.60కోట్ల నాబార్డు నిధులతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. కమ్యూనిటీ వైద్యశాల నూతన నిర్మాణాన్ని కేఎంసీ సంస్థ గ్రూప్ ప్యాకేజీ కింద చేపట్టింది. పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

స్పెషలిస్టు వైద్యుల నియామకం

ఇన్నేళ్లుగా గైనిక్, చిన్నపిల్లల వైద్యులతో ఆసుపత్రిలో సేవలందిస్తూ వచ్చారు. ప్రభుత్వం రీస్ట్రక్చరింగ్ విధానాన్ని అమల్లోకి తేవటంతో పీహెచ్‌సీల్లో ఉన్న స్పెషలిస్టు వైద్యులను సీహెచ్‌లకు మార్చింది.దీంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు అదనంగా స్పెషలిస్టు డాక్టర్ల నియామకం జరిగింది. ఇటీవల ఈఎన్‌టీ, డెంటిస్ట్, ఆర్థో, చర్మ, పెథాలజీ, ఆప్తమాలజీలతో పాటు ముగ్గురు డ్యూటీ డాక్టర్లు(ఎంబీబీఎస్)లు జాయిన్ అయ్యారు. ప్రస్తుతం వివిధ విభాగాల్లో 15 మంది ప్రధాన డాక్టర్లు సేవందిస్తున్నారు. రూ.2కోట్లతో ప్రసూతి వార్డును ఆధునికీకరించడంతో రికార్డుస్థాయిలో ఇక్కడ ప్రసవాలు జరుగుతున్నాయి. అదే విధంగా స్థానికంగానే కంటి ఆపరేషన్లు చేస్తూ పేదలకు వెలుగును ప్రసాదిస్తున్నారు. 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ కావటంతో సిక్ న్యూబార్న్ కేర్ యూనిట్(ఎస్ఎన్‌సీయూ) మంజూరైంది. మదర్, చైల్డ్ (ఎంసీహెచ్)డెత్‌ల నివారణకు, పుట్టిన పిల్లలకు అవసరమైన ఆధునికవైద్యం, వసతికి ఇది దోహదం చేస్తోంది. అదే విధంగా జనరల్ సర్జన్ డాక్టర్లు, అనస్తీషియా డాక్టర్ల నియామకం, అదనంగా ఆపరేషన్ థియేటర్లు తదితర సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

వైద్యసేవల్లో నూతన అధ్యాయం



ఎమ్మిగనూరు ఆసుపత్రి 100 పడకలకు అప్‌గ్రేడ్ కావటంతో స్పెషలిస్టు వైద్యులు విధుల్లో చేరారు. ఫలితంగా గైనిక్, కంటివైద్యం, ఆర్థో సేవలు పెరిగాయి. ప్రభుత్వం రీస్ట్రక్చరింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చి నిష్ణాతులైన వైద్యులను ప్రజాసేవకు వినియోగిస్తోంది. నూతన భవనం నిర్మాణం పూర్తయితే అదనపు వైద్యసేవలు కూడా అందుబాటులోకి వస్తాయి.

– దాక్టర్ మైత్రేయి, సూపరింటెండెంట్

ఆరు నెలల్లో పూర్తి



ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రి నూతన భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్ పూర్తయింది. ఈ నెలాఖరులో మొదటి ఫ్లోర్ స్లాబ్ పూర్తి చేస్తాం. ఆరు నెలల వ్యవధిలో మొత్తం పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో కాంట్రాక్ట్ సంస్థతో సమన్వయం చేస్తున్నాం.

–శివరామిరెడ్డి, ఈఈ (హాస్పటల్స్)

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు



ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, కంగాటి శ్రీదేవి

ఎమ్మిగనూరుటౌన్: నెలరోజుల పాటు నిష్ఠతో ఉపవాస దీక్షలుండి శనివారం రంజాన్ ఈద్ జరుపుకుంటున్న ముస్లింలందరికీ మంచి జరగాలని, సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన నియోజకవర్గ ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వెల్దుర్తి: అల్లాహ్ దయతో ముస్లింలకు అంతా మంచి జరగాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆకాంక్షించారు. నేడు రంజాన్ పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని ముస్లింలకు శుక్రవారం ఆమె ఓ ప్రకటనలో పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమం

కృష్ణగిరి: తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధ్వర్యంలో మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో మూడు రోజులుగా నిర్వహించిన ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. గ్రామంలోని మాధవస్వామి ఆలయంలో హిందూ ధర్మ ప్రచార ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, లలితా పీఠం పీఠాధిపతులు మేడా సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సర్వేశ్వరమ్మ, వీరభద్రుడు, బాల మిన్నెల్ల, శేషు, అర్చకులు గోవిందయ్య, వెల్దుర్తి హనుమాన్ జంక్షన్ వ్యవస్థాపకులు రామాంజనేయస్వామి, సురేష్, తిమ్మయ్య పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

తుగ్గలి : ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి లంకాయపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. వారం క్రితం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో స్థానికులు సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి కొత్తగా బోరు వేయించారు. రెండు ఇంచుల నీళ్లు పడినట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతరెడ్డి తెలిపారు.

రోజూ స్పందన నిర్వహించాలి

కృష్ణగిరి: గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు.

ప్రశాంతంగా పండుగ చేసుకోండి

హొళగుంద: రంజాన్ వేడుకను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ శ్రీనివాసులు మండలంలోని ముస్లిం పెద్దలకు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారితో సమావేశం నిర్వహించారు.

సీజనల్ హాస్టల్ తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న హొళగుంద ఎంఈఓ ఈరన్న

హొళగుంద: స్థానిక కొండ కాలనీలోని కడ్లమాగి పాఠశాల భవనంలో కొనసాగుతున్న సీజనల్ హాస్టల్‌ను ఎంఈఓ ఈరన్న శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వసతి, నాణ్యమైన భోజనం, విద్య అందుతుందా లేదా అని ఆరా తీశారు. కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించిన ఆయన చదువులో రాణించాలన్నారు. అనంతరం ఆయన హెచ్‌ఎంలతో సమావేశమై వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించిన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ చిన్నహ్యాట నాగరాజు ఉన్నారు.

ఆత్మీయ కలయిక



ఎస్.రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, కరస్పాండెంట్‌లు

పత్తికొండ రూరల్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన ఎంవీ రామచంద్రారెడ్డి స్థానిక గోపాల్ ప్లాజాలో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీగా తన విజయానికి కృషి చేసిన వారికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి నివాసానికి వెళ్లి ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌లు యజ్ఞం వెంకటమాదవ్, రఘునాథ్, రాజేంద్రరెడ్డి, పక్కీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30న బ్రహ్మంగారి ఆరాధన

పత్తికొండ రూరల్ : స్థానిక బ్రహ్మంగారి ఆలయంలో ఈనెల 30వ తేదీన బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం తాలూకా అధ్యక్షుడు శంకరయ్యాచారి, అర్చకుడు బ్రహ్మయ్యాచారి తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 6గంటలకు సుప్రభాత సేవ, విశేష పూజలు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి భజన ఉంటుందన్నారు. బ్రహ్మంగారు మహాసమాధి అయిన సందర్భంగా జరిగే ఆరాధన మహోత్సవంలో విశ్వబ్రాహ్మణులు, భక్తాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రంజాన్ నమాజ్‌కు సిద్ధం



వెల్దుర్తి ఈద్గా

వెల్దుర్తి: రంజాన్ పండుగ సందర్భంగా నేడు ముస్లింలు నమాజు చేసుకునేందుకు ఈద్గాలను సిద్ధం చేశారు. ఇప్పటికే జామియా మసీదు కమిటీ ఈద్గాకు పెయింటింగ్ పనులు పూర్తి చేశారు. పరిశుభ్రత పనులను స్థానిక మేజర్ పంచాయతీ సిబ్బంది చేపట్టారు. పిచ్చిమొక్కలు తొలగించి, ప్రార్థనలకు అనువుగా ఈద్గా ప్రదేశాన్ని చదును చేశారు. నమాజ్ సమయంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు కోరినట్లు జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు గట్టు ఆరిఫ్ తెలిపారు. రంజాన్ నెలలో ప్రతి మసీదు వద్ద సౌకర్యాలు, ఖబరస్తాన్‌కు గ్రావెల్ తరలించి రస్తాల ఏర్పాటు, ఈద్గా ప్రాంతంలో పరిశుభ్రత పనులకు సహకరించిన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ వెల్దుర్తి మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, పంచాయతీ సర్పంచ్ ముత్యాల శైలజకు మసీదు కమిటీ ప్రతినిధులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పండుగ నమాజు ఈద్గాలో ఉదయం 9 గంటలలకు ఉంటుందని, పాత బస్టాండు సమీప ఈద్గా మసీదులో 9.30 గంటలకు ఉంటుందని మత పెద్దలు తెలిపారు.

బీజేపీని గద్దెదింపాలి

నందవరం: ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ, సీపీఎం జిల్లా నాయకులు గుణశేఖర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్షాలు(సీపీఐ, సీపీఎం) తలపెట్టిన ప్రచార భేరి కార్యక్రమం శుక్రవారం మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక, నిరుపేదలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు హనుమంతు, నరసింహులు, పెద్దయ్య, శ్రీరాములు, మల్లేష్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం మరచిన మోదీ

కృష్ణగిరి: ప్రధానమంత్రి మోదీ ప్రజా సంక్షేమ మరిచారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నక్కి లెనిన్‌బాబు ఆరోపించారు. మండల పరిధిలోని కటారుకొండ గ్రామంలో మండల కార్యదర్శి ఖలీల్‌బాషా, సహాయ కార్యదర్శి రవిమోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి ధర్నా చేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శి వెంకటరాముడు, ఆర్‌బీ చిన్నమాదులు, పులిచెర్ల చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలను ప్రోత్సహించాలి



మంత్రి జయరాంకు గౌతమ బుద్ధుడి ప్రతిమను అందిస్తున్న బడిగెంజల విజయలక్ష్మి

ఎమ్మిగనూరుటౌన్: హస్తకళలను ప్రోత్సహించాలని ఏపీ హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి)చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. హస్తకళాకారులు తయారు చేసిన గౌతమ బుద్ధుడి ప్రతిమను ఎమ్మెల్యేకు అందజేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు హస్తకళలను ప్రోత్సహిస్తే కళాకారులు తయారు చేసిన వస్తువుల కొనుగోలు పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అదేవిధంగా రాష్ట్ర వీరశైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి హస్తకళల గురించి వివరించి ఆయనను సత్కరించారు. అనంతరం ఆమె పట్టణంలోని చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘాన్ని సందర్శించారు. అక్కడ చేనేత కార్మికులు నేస్తున్న నేత వస్త్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆమె వెంట బీసీ సంఘ రాష్ట్ర నాయకులు చంద్రమౌళి, వైడబ్ల్యూసీఎస్ చైర్మన్ నాగరాజు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, కర్నూలు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య, తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘ నాయకులు ప్రసాద్, నరసింహులు,ఎంఆర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: హస్తకళల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. శుక్రవారం మంత్రిని ఆలూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏపీ హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి హస్త కళాకారులు తయారు చేసిన బుద్ధుడి ప్రతిమను మంత్రికి అదించారు. కార్యక్రమంలో లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

మద్దికెర: పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం మద్దికెరలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ కవిదాసు, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

వైఎస్సార్ బీమా సాయం అందజేత

తుగ్గలి : మండల పరిధిలోని రామలింగాయపల్లికి చెందిన చాకలి మోహన్ (35) అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకంలో తాత్కాలిక సహాయంగా మంజూరైన రూ.10 వేలను మృతుడి భార్య లక్ష్మికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మారెడ్డి, నాగిరెడ్డి అందజేశారు. మిగిలిన సొమ్ము బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

హొళగుంద ఎస్ఐగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

హొళగుంద: హొళగుంద ఎస్ఐగా వల్లెపు శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న అబ్దుల్ జహెర్‌ను వీఆర్‌కు పంపించి అనంతపురం జిల్లాలో పని చేస్తున్న శ్రీనివాసులును హొళగుందకు నియమించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరురూరల్: రైతు భరోసా పథకానికి కొత్త రైతులు ఈనెల 30లోపు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2023–2024 ఆర్థిక సంవత్సరానికి మే నెలలో సాయం అందుతుందన్నారు.

ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నారాయణ

చిప్పగిరి: ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా చిప్పగిరి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గుమ్మనూరు నారాయ ణ నియమితులయ్యా రు. ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన మంత్రి జయరాంకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక మార్కెట్ యార్డ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

పేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో శుక్రవారం నిరుపేద ముస్లిం కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన మల్లికార్జున, ఆయన సోదరుడు లక్ష్మీకాంత్ ఉచితంగా రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. బియ్యం, చక్కర, వంట నూనె తదితర సరుకులను అందజేశారు.

- ఎద్దులదొడ్డిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శ్రీదేవి

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు



ఎద్దులదొడ్డిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. రెండోరోజు శుక్రవారం ఎద్దులొడ్డిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం కొనసాగించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అలాగే ప్రజా సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. పక్కా గృహాలు మంజూరు చేయాలని, శుద్ధజలం సరఫరా కావడం లేదని, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని, రేషన్ కార్డు, పింఛన్ పునరుద్ధరించాలని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఆమె అర్హత ఉన్న వారందరికీ పథకాలు అందేలా చూడాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు.

అర్హతే ప్రామాణికం..

సీఎం వైఎస్ జగనన్న పాలనలో ఎదురు చూపులు, సిఫార్సులకు అవకాశం లేదని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా అర్హుల ఇంటికే పథకాలు వస్తున్నాయన్నారు. పార్టీలకతీతంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనను మళ్లీ గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, పార్టీ నాయకులు రాతన మోహన్‌రెడ్డి, తుగ్గలి మోహన్‌రెడ్డి, వెంకటరాముడు, మధు, విజయ్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, సుధాకరరెడ్డి, మనీంద్ర, ఈశ్వరరెడ్డి, రామాంజినేయులు, హరిశ్చంద్ర, చిరంజీవి, సుధాకర్, రామయ్య, రఘు, హనుమంత రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఎప్పుడూ అందుబాటులో ఉంటా

వెల్దుర్తి: నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ప్రతి వారం ఆమె వెల్దుర్తి, కృష్ణగిరి మండల ప్రజలకు, వైఎస్సార్‌సీపీ నాయకులకు అందుబాటులో ఉంటారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆమె స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలతో పలు సమస్యలపై చర్చించారు. ప్రజలు సమర్పించిన వినతులపై స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల కన్వీనర్లు బొమ్మన రవిరెడ్డి, ఆర్‌బీ వెంకట్రాముడు, వెల్దుర్తి జెడ్పీటీసీ సుంకన్న, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు ఉన్నారు.